క్లుప్తంగా

రక్తదానం



ప్రశంస పత్రాలు ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన మైత్రి యోగ, ప్రకృతి చికిత్సాలయంలో డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 25 మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, తలసేమియా, సికిల్‌సెల్, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు అవసరమైన రక్తాన్ని అందించలేక పోతున్నామని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి వి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మైత్రి యోగా ఆధ్వర్యంలో రక్తదానం చేసేందుకు మహిళలు సైతం ముందుకు రావడం అభినందనీయమని, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం డాక్టర్ సమీర చేతుల మీదుగా రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో హైటెక్‌సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టినేని హన్మంతరావు, సారయ్య, ముల్కల సత్యనారాయణ రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సత్యనారాయణ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శ్రీనివాస్, శైలజ, ప్రేమ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

నేడు భీమారం మండల సమావేశం

భీమారం: మండలంలోని 11 గ్రామపంచాయతీల్లోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధారాథోడ్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

రేపు శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్‌లో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు వెంకటేశ్వరాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

10 మందికి ఉచిత వసతి, ఉద్యోగం

మంచిర్యాలఅర్బన్: స్థానిక వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపులో 60 శాతం మార్కులతో ఈ సంవత్సరం పాసైన విద్యార్థులకు ఆదివారం ఎంఎస్ఎన్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగంతో పాటు ఉచిత విద్యకు ఎంపిక నిర్వహించారు. 90 మంది విద్యార్థులు హాజరుకాగా 10 మంది అర్హత సాధించారు. ఉచిత విద్య, భోజనం, వసతితో పాటు జీతంతో కూడిన ఉద్యోగం నియామకాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంతోష్, నవీన్‌రెడ్డి, సాయినాథ్, మణిబాల పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

వేమనపల్లి: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. మండలంలోని మంగెనపల్లిలో ఆదివారం పోలీసు కళాబృందాలతో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పిస్తూ బాల్య వివాహాల నిర్మూలన, 100 డయల్, షీ టీమ్ ప్రోగ్రాం యొక్క ఆవశ్యకతను పాటల రూపంలో పోలీసు కళాబృందం వివరించారు.

పోచమ్మకు మొక్కులు



పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాలు పోచమ్మ ఆలయాల బాట పట్టాయి. గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఉన్న బుగ్గ పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలకు ఆదివారం భక్తులు భారీగా పోటెత్తారు. కుటుంబాలతో సహా చేరుకుని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడే అంతా వంటలు చేసుకుని మరీ సామూహికంగా భోజనాలు చేశారు.

నో ఫైర్ సేఫ్టీ..!



జీవీఆర్ కాంప్లెక్స్‌లో విద్యుత్ ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

- వేసవిలో అపార్ట్‌మెంట్లు, గోడౌన్లు, దుకాణాలకు పొంచి ఉన్న ముప్పు
- నిబంధనలు పాటించని యజమానులు
- అగ్నిప్రమాదాల నివారణ చర్యలు కరువు
- తనిఖీలు చేపట్టని సంబంధిత అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు పాఠశాలలు, అపార్ట్‌మెంట్స్, గోడౌన్స్, దుకాణాల సముదాయాలకు అగ్ని ప్రమాదాలు జరిగితే వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదనే ఆరోపనలు ఉన్నాయి. పట్టణంలో జనావాసాల నడుమ నిర్మాణాలు ఉన్నప్పటికీ అగ్ని ప్రమాదాల నివారణకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. దీనికి సంబంధించిన అధికారులు తనిఖీలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో యజమానులు వాటి ఊసే మరిచారు. గత నెలలో రామగుండం సీపీ శ్రీనివాస్ సమావేశం నిర్వహించి తప్పనిసరిగా జనావాసాల్లోని అపార్ట్‌మెంట్స్, గోడౌన్స్, స్టోర్స్ కమర్షియల్ షాపింగ్స్‌పై తరుచుగా అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఫైర్‌సేఫ్టీ తనిఖీలు తరుచుగా నిర్వహించి నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలే అధికం..

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 1/70 నిబంధనలు ఉన్నందు వల్ల పట్టణంలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఉండవు. అయినా అక్రమంగా అనేక పాఠశాలలు, దుకాణాలు, నిర్మాణాలు వెలిశాయి. అక్రమ నిర్మాణాలను నిలువరించాల్సిన అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల వ్యవహారంతో వాటికి సంబంధించి ఎలాంటి ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించలేదు. విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన యజమానులు, ఫైర్‌సేఫ్టీ నిబంధనల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఏదైనా అగ్ని ప్రమాదం, విద్యుత్ షాక్ లాంటి ప్రమాదాలు సంభవిస్తే ఆర్థిక నష్టంతో పాటు ప్రాణనష్టం కూడా జరిగే ప్రమాదముందని పలువురు పేర్కొంటున్నారు. ఫైర్‌సేఫ్టీ తనిఖీలు చేయాలని పలువురు కోరుతున్నారు.

కొన్ని సంఘటనలు...



మార్కెట్ ఏరియాలో ఫైర్‌సేఫ్టీ లేని దుకాణాలు

- గత నవంబర్ మాసంలో మందమర్రి మార్కెట్ ఏరియాలో ఓ కాంప్లెక్స్‌లో ఫైర్ సేఫ్టీ పికాషన్స్ తీసుకోకపోవడం, ఫైర్ నియంత్రణ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ ప్రమాదంలో విలువైన సామగ్రి దగ్ధమైంది.
- నాలుగు నెలల క్రితం ఓ సెలూన్ షాపులో జరిగిన విద్యుత్ ప్రమాదంలో రూ.ఆరు లక్షల విలువైన సామగ్రి దగ్ధమైంది.
- ఏడు సంవత్సరాల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో మార్కెట్ సెంటర్లోని హనుమాన్ టెంపుల్ ముందున్న పలు షాపులు ఒక్కొక్కొటిగా కాలి బూడిదయ్యాయి.

ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలి

పట్టణంలోని దుకాణాల సముదాయాలు, పాఠశాలలు, గోడౌన్స్ తదితర నిర్మాణాల యజమానులు సేఫ్టీ నిబంధనలు తప్పకుండా పాటించాలి. విద్యుత్ ప్రమాదం, అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ప్రాణనష్టం, ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదం జరిగితే నివారణ కోసం ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించని నిర్మాణాల యజమానులపై చర్యలు తప్పవు.

- శశిధర్‌రెడ్డి, సీఐ, మందమర్రి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బెల్లంపల్లి పట్టణ ట్రాన్స్‌కో ఏ.ఈ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో కరెంట్ సరఫరాను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. బజార్ ఏరియా రోడ్ నంబర్ 2, 3, 4, కన్నాల బస్తీ, పోస్ట్ ఆఫీస్ బస్తీ, పెద్దనపల్లి, కాల్‌టెక్స్ ఏరియా, గాంధీనగర్, గంగారాం నగర్, టేకుల బస్తీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లి 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు సోమగూడెం, పాతబెల్లంపల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, లింగాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంపల్లి మండల విద్యుత్ శాఖ ఏ.ఈ రామ్‌మనోహర్ తెలిపారు. దీంతో పాటు బుధాకుర్దు 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా చాకేపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని టౌన్-2, మండలంలోని బొక్కలగుట్ట విద్యుత్ లైన్‌లలో మరమ్మతులు, లైన్‌కు తాకుతున్న చెట్ల కొమ్మలను కొట్టివేస్తున్న కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ మల్లేషం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మార్కెట్ ఏరియా, దీపక్‌నగర్, శ్రీపతినగర్, దొరలబంగ్లాస్ ఏరియా, పులిమడుగు, బొక్కలగుట్ట, కోటేశ్వరరావుపల్లె, పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సత్వరమే ధాన్యం కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్

భీమారం: రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో పెద్ద మొత్తంలో రైతులు ధాన్యం పండించారని, వాటిని అమ్మేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే రోజుల తరబడి తూకం వేయడంలేదని ఆరోపించారు. రోజుల తరబడి కేంద్రాల్లో రైతులు ఎదురుచూస్తున్నారని, అయినా అధికారులు సత్వరచర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని ధాన్యం సత్వరమే కొనుగోలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మద్దికల్ మాజీ ఎంపీటీసీ ఆత్మారి రాము, నాయకులు ఆకుదారి రాజన్న, దుర్గం లాజర్, అనపర్తి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న జీఎం దంపతులు, భక్తులు

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీనివాస పద్మావతి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణంతో పాటు నవగ్రహ హోమ కార్యక్రమం, కలుష పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం మనోహర్-సవిత దంపతులతో పాటు 108 మంది జంటలు పాల్గొన్నారు. షణ్ముఖశర్మ శిష్య బృందం మత్రోత్సరణ నడుమ కల్యాణం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ సమీప ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మె ల్యే నల్లాల ఓదెలు, సింగరేణి గుర్తింపు ప్రాతిని ధ్య సంఘాల ప్రతినిధులు కల్యాణ తంతులో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



చెన్నూర్: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సోమగూడంలో నివాళులర్పిస్తున్న వాకర్స్

చెన్నూర్: పట్టణంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో సుందరయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ముఖ్య అతిథిగా హాజరై సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ, నగేశ్, ఉమారాణి, సమ్మక్క, రాజేశ్వరి, చంద్రన్న, మారన్న, రేణుకా, రమాదేవి పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడు కామ్రెడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కామ్రెడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకులు ప్రభాకర్, కుమార స్వామి, దూర్కె మోహన్, మిడివెల్లి రాజ్‌కుమార్, పి.రాములు, రాజు, రాందాస్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని కోయపోచగూడలో సీపీఎం ఆధ్వర్యంలో కామ్రెడ్ సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు, కోయపోచగూడ గిరిజనులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని సోమగూడం మైదానంలో వాకర్స్, క్రీడాకారుల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్, క్రీడాకారులు సంకె రవి, సిద్ధయ్య, శ్రీనివాస్, పోశం పాల్గొన్నారు.

భూ కబ్జా ముఠాపై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: పట్టణంలోని గతంలో ఎన్నడూ లేని విధంగా కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నిరుపేదల భూములను కబ్జా చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బండారి చిన్నన్న అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీలో గల 4 గుంటల భూమిని 2014లో ఎరుకల దేవయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి రిజిష్టర్ చేసుకున్నానని తెలిపారు. ఎనిమిదేళ్ల తర్వాత దేవయ్య, మద్దెల భవాని, గోపినాథ్, తగరం వెంకటేశ్ అనే నలుగురు వ్యక్తులు నా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గుంటల భూమి ఇస్తావా, లేదంటే రూ.6 లక్షలు ఇవ్వాలని మద్దెల భవాని వేధింపులకు గురి చేస్తుందన్నారు. ఇదేమని అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయిస్తానని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిరుపేదల భూములను కబ్జా చేస్తూ వేధింపులకు గురి చేస్తున్న ముఠాపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన శాతరాజు లింగయ్య-లక్ష్మీ దంపతుల కూతురు శిరీష వివాహానికి మాజీ ఎంపీటీసీ ముత్తె నారాయణ రూ.5వేలు, మాజీ వార్డు సభ్యుడు 75కిలోల బియ్యాన్ని ఆదివారం అందించారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో వీటిని అందించినట్లు పేర్కొన్నారు.

గుడి నిర్మాణానికి చేయూత

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి లక్ష్మీదేవర గుడి నిర్మాణానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫయాజ్ ఆదివారం రూ.1లక్ష 35వేలతో స్లాబ్ సామగ్రి అందజేశారు.

అటెన్షన్ ప్లీజ్..

రక్షణ గోడలు లేక వాహనదారుల ఇబ్బందులు



కొత్తగూడెం వద్ద రక్షణ గోడ నిర్మించని కల్వర్టు

భీమారం: మండల కేంద్రం నుంచి నెన్నెల మండల కేంద్రం వరకు గల ప్రధాన రహదారిలో కొత్తగూడెం వద్ద కల్వర్టుకు రక్షణ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. భీమారం నుంచి నెన్నెల వరకు కల్వర్టులు, వంతెనలు నిర్మించిన ఆర్‌అండ్‌బీ అధికారులు భీమారం సమీపంలోని కొత్తగూడెం వద్ద మూలమలుపు వద్ద గల కల్వర్టు నిర్మించి రక్షణగోడ నిర్మించకపోవడంతో వాహన చోధకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వెంటనే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : భరత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, చెన్నూర్

ఫోన్ నంబర్ : 94408 19099

బురద రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులు



పార్‌పల్లి లింగన్నపేట మధ్య తాత్కాలిక రోడ్డు



కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి లింగన్నపేట గ్రామాల మధ్యలో ఉన్న లోలెవల్ కల్వర్టు కోసం రూ.2కోట్ల నిధులు మంజూరు కాగా వంతెన నిర్మాణం జరుగుతోంది. వంతెన నిర్మాణం జరుగుతుండంతో సదరు కాంట్రాక్టర్ వాహనాలు వెళ్లేందుకు తాత్కాలిక రోడ్డు నిర్మాణాన్ని నాసిరకం మొరంతో చేపట్టగా వర్షానికి బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎన్నికల సమయంలో అటువైపుగా ఉన్న 10గ్రామాలకు ఎన్నికల విధులకు వెళ్లే అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటి వరకూ స్పందించిక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేయించాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారి పక్కనే ఇసుక దిబ్బలు



జన్నారం: ప్రధాన రహదారి పక్కనే సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రం. వాటి పక్కనే నిలువెత్తు ఇసుక దిబ్బలు. రహదారి పక్కనే ఉన్న ఇసుక కుప్పలపై నిత్యం ప్రయాణించే అధికారుల కన్ను పడకపోవడం గమనార్హం. జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామ సమీపంలో గల ఓ సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రం వద్ద ఇలా సుమారు వంద ట్రాక్టర్ల ఇసుకను నిలువ పోశారు. వేసవిలో నీటి సమస్య తలెత్తేలా వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా, ప్రభుత్వ పన్నును ఎగ్గొడుతూ వాడుకోవడం తప్పు అని, చట్ట రిత్యా నేరమని తెలిసినా అధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమంగా ఇసుక వాడుకుంటున్న సిమెంట్ ఇటుక తయారీ దారులపై కొరఢా ఝలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాక్సింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం

మందమర్రిరూరల్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ప్రారంభించారు. క్రీడాకారులకు బాక్సింగ్ కిట్స్ అందించారు.